ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 128 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 17 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# వచ్చే వారం నుంచి... ఉద్యోగ నోటిఫికేషన్లు

**పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ**

**ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు సర్కార్ ప్లాన్**

**ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్**

**వదంతులు నమ్మొద్దని, ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టాలని యువతకు సూచన**



**హైదరాబాద్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉ ద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఛైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీ తనానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యో గాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో ..మిగతా 2లో

## కల్తీని అరికట్టేందుకు
# ప్రభుత్వం కీలక నిర్ణయం

**ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు**

**ఆహార, ఔషధ నియంత్రణ శాఖలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం**

**'టీజీ సేఫ్' పేరిట కొత్త ఏకీకృత అథారిటీ ఏర్పాటు**

**నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి నియామకం**



**హైదరాబాద్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు ..మిగతా 2లో

## కేసీఆర్ హయాంలో ఫ్యామిలీ జస్టిస్..
# మా హయాంలో సోషల్ జస్టిస్



**వంద మంది కేసీఆర్‌లు వచ్చినా ఏం పీకలేరు.. బీఆర్ఎస్ రేవంత్ ఫైర్**

**సెప్టెంబర్ అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్‌ను తీసుకురావాలని కేటీఆర్, హరీశ్‌రావులకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్**

**వరంగల్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని బావా-బావమరిది (కేటీఆర్, హరీశ్‌రావు) పదే పదే అడుగుతున్నారు.. సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు పెడతామని మీతో పాటు కేసీఆర్ ను కూడా సభకు తీసుకురావాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, రెండున్నరేళ్ల మా కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో జరిగిన పనులపై చర్చిద్దామన్నారు. ఆదివారం పరకాల సభలో మాట్లాడిన సీఎం. విడతల వారీగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని, పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేని వారు ఇప్పుడు మన పిల్లలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని సీఎం అన్నారు. అగ్గిపెట్టేరావు, అఘోరరావు మాటలు వింటే మోసపోతారని నిరుద్యోగులు నిరసనల్లో పాల్గొంటే కేసులతో ఇబ్బందిపడతారని హెచ్చరించారు. అనుభవం లేకపోయినా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అహర్నిశలు కష్టపడుతున్నామని స్పష్టం చేశారు.

**కార్యకర్తల రక్తాన్ని అమ్ముకున్నారు**

రక్తదానం పేరుతో హరీశ్ రావు, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల రక్తాన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు అమ్ముకుని సొమ్ముచేసుకున్నారని మీరు మనుషులా రాక్షసులా అని సీఎం ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన కుటుంబం రక్తపిపాసులుగా మారారని ధ్వజమెత్తారు. పార్టీలో పదవులు తీసుకున్న కేసీఆర్ కుటుంబం ఆయన బంధువులు ఎందుకు రక్తదానం చేయలేదు. అని నిలదీశారు. ప్రజల కోసం ఎంతవరకైనా కష్టపడతానని మీ ఆశీర్వాదం ఉన్నంత వరకు వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా ..మిగతా 2లో

## వనదేవతల సమక్షంలో
# చేయూత పింఛన్లకు శ్రీకారం



**రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం: సీఎం**

**పలువురు మహిళలకు కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం**

**హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించిన రేవంత్**

2

## మోదీ ఫొటో కావాలంటే
# సన్నబియ్యం డబ్బులివ్వండి

**స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు**

**హైదరాబాద్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు ..మిగతా 2లో



# ఘనంగా బండ్ల గణేశ్ కుమార్తె వివాహం
**హాజరైన చంద్రబాబు, రేవంత్**



**పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఏడడుగులు**

**హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు**

**హైదరాబాద్ వేదికగా జరిగిన వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు**

2



# వచ్చే వారం నుంచి... ఉద్యోగ నోటిఫికేషన్లు

**మొదటి పేజీ తరువాయి...**

10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.




# వనదేవతల సమక్షంలో చేయూత పింఛన్లకు శ్రీకారం

**మేడారం, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి, రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చదువు ఒక్కటే ఉద్యోగాన్ని ఇవ్వదని, స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, ఇంటర్ తర్వాత విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. నైపుణ్యం ఉన్నవారికి జర్మని, జపాన్, కొరియాలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులకు జర్మని, జపాన్, కొరియన్ భాషలు నేర్పిస్తామని తెలిపారు. “ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ములుగు నుంచే పాదయాత్ర మట్నదలు పెట్టాం. పోరాటానికి, పౌరుషానికి మారుపేరైన సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుని పాదయాత్ర చేపట్టాం. ప్రజల సమస్యలను తెలుసుకుని తీరుస్తామని హామీ ఇచ్చాం. మీ ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చాం. వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. మల్లూరు నరసింహస్వామి దేవాలయానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తాం. జంపన్న వాగును కూడా నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తాం. ములుగు ప్రాంత అభివృద్ధికి ఏం కావాలో చెబితే నిధులు మంజూరు చేస్తాం” - రేవంత్ రెడ్డి, సీఎం సొంత చెల్లినే బయటకు నెట్టారు : రక్తం పంచుకు పుట్టకపోయినా మంత్రి సీతక్కను సొంత ఆడబిడ్డగా చూసుకుంటున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. కొందరు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లినే బయటకు నెట్టారని విమర్శించారు. సొంత చెల్లికే న్యాయం చేయని వారు రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తారా? అని ప్రశ్నించారు. కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించాల్సిన తండ్రి ఫాంహౌస్‌లో పడుకున్నారని, సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే మౌనంగా ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సమీకృత కలెక్టరేట్ ప్రారంభం : ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సైతం ఆవిష్కరించిన సీఎం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని మంత్రులతో కలిసి పరిశీలించారు.




సీఎం సమక్షంలో కలెక్టర్ హేమంత్ బోర్ఖడే కొత్త కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ హేమంత్‌ను ఆయన సీట్లో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

వనదేవతలను దర్శించుకున్న రేవంత్ రెడ్డి : అంతకు ముందు ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. పూజారులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలోకి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. వనదేవతలకు నిలువెత్తు బంగారం, చీర, సారె, పసుపు, కుంకుమలను సీఎం రేవంత్ సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వన దేవతల సమక్షంలో సీఎం, మంత్రులకు సీతక్క రాఖీలు కట్టారు. అనంతరం ఒంటరి మహిళలు, వితంతువుల కోసం ఉద్దేశించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని మేడారం వేదికగా ప్రారంభించారు. ఒంటరి మహిళలకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం, పలువురికి కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. అనంతరం మేడారం ప్రాంగణంలో మొక్కలు నాటిన రేవంత్ రెడ్డి మహిళలతో కాసేపు ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎంతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం : మేడారం నుంచి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకున్న రేవంత్‌రెడ్డి వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గట్టమ్మ ఆలయం వద్ద హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. దీని ద్వారా పంచాయతీరాజ్ శాఖలోని గ్రామాల రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. మొదటి విడతగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.16 వేల కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మూడు దశల్లో పంచాయతీరాజ్ రోడ్లను హ్యామ్ విధానం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. మూడు దశల్లో 18 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది.

# ఘనంగా బండ్ల గణేశ్ కుమార్తె వివాహం





**హైదరాబాద్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజతో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు దంపతులు, తెలంగాణ సీఎం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులు జనని, సూర్య తేజ వద్దకు వెళ్లి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ, బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన కుమార్తె పెళ్లి వేడుకకు చంద్రబాబు సతీసమేతంగా రావడం పట్ల బండ్ల గణేశ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఓ దశలో ఏడ్చేశారు. దాంతో పక్కనే ఉన్న సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడించారు. కాగా, వరుడు సూర్యతేజ సీఎం చంద్రబాబు-నారా భువనేశ్వరిల చేతులమీదుగా తాళి అందుకుని వధువు మెడలో మంగళసూత్రధారణ చేయడం విశేషం. బండ్ల గణేశ్ కు సినీ, రాజకీయ రంగాల్లో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో, ఈ వివాహ వేడుకకు ఇరు రంగాలకు చెందిన నాయకులు, నటీనటులు, నిర్మాతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి రాకతో వివాహ ప్రాంగణం సందడిగా మారింది. అతిథులను బండ్ల గణేశ్ దంపతులు సాదరంగా ఆహ్వానించి, వారి బాగోగులు చూసుకున్నారు. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కుమార్తె జనని-సూర్యతేజ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరయ్యారు. వేడుకలో బండ్ల గణేశ్ కుటుంబసభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి సందడి చేశారు. వారంతా నూతన దంపతులను అభినందించి, ఆశీర్వదించారు. ప్రముఖుల రాకతో వివాహ ప్రాంగణం కోలాహలంగా మారింది. బండ్ల గణేశ్ ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తూ కనిపించారు.

# కేసీఆర్ హయాంలో ఫ్యామిలీ జస్టిస్..

**మొదటి పేజీ తరువాయి...**



పీకలేరన్నారు. సోషల్ మీడియాలో పెడితే ఒరిగేది లేదు కరిగేదని, రేపు శాసనసభలోనే తేల్చుకుందామన్నారు. ఎప్పటికీ అధికారంలోనే ఉంటామని విర్రవీగిన వారిని వరంగల్ జిల్లా ప్రజలు బండకేసి కొట్టారని, తమను ఓడించేవారే లేరనుకున్న వారిని రాజకీయంగా బొందపెట్టారని సీఎం వ్యాఖ్యానించారు. కాకలు తీరిన రాజకీయ నేతలను యశస్విని రెడ్డి భారీ మెజారిటీతో ఓడించి ప్రజల తీర్పు ఏంటో చూపించారని గుర్తుచేశారు. గతంలో కేసీఆర్ ‘వరి వేస్తే ఉరే’ అని రైతులను భయభ్రాంతులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం వచ్చాక రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం చెప్పారు. బీఆర్ఎస్ రెండుసార్లు రుణమాఫీ పేరిట మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేసి చూపించిందన్నారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు జమ చేశామని, మొత్తంగా రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.లక్షా 37 వేల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు.

**కవితను ఇంటి నుంచి పంపేశారు**

జైలుకుపోయి కష్టాల్లో వచ్చిన తన సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కవితను కేటీఆర్ ఇంటి నుంచి బయటకు పంపేశాడని ఇదంతా చూస్తున్న కేసీఆర్ తన కొడుకుకు బుద్ధి చెప్పాల్సింది పోయి మౌనంగా ఉండిపోయారని విమర్శించారు. ఇక అఘోరారావు యువతను రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు.

# కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి...**

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది.‘టీజీ సేఫ్’ నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది.ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.

# మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

**మొదటి పేజీ తరువాయి...**

సృష్టించవద్దని ఆయన హితవు పలికారు.సూర్యాపేటలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# 22 ఏ నిషేధిత భూముల వివరాలు సాక్షాదారాలతో జిల్లా స్థాయికి పంపండి: కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు16(ప్రభాత ఉదయం)**



22 ఏ నిషేధిత భూముల రికార్డులను ఎవిడెన్స్‌తో జిల్లా స్థాయికి పంపాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. పెద్ద విస్తీర్ణాలకు సంబంధించిన కేసులు, పార్ట్ సర్వే నంబర్లు, యు ఎల్ సి,సీలింగ్, వక్ఫ్, భూదాన్, హెచ్‌ఎండిఏ తదితర సున్నితమైన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించాలని తెలిపారు.

**పారదర్శకమైన రికార్డులే లక్ష్యం**

సెక్షన్ 22-ఏ సవరణ ప్రక్రియలో ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూమి పొరపాటున జాబితా నుంచి తొలగిపోకుండా, అదే సమయంలో ప్రభుత్వ ప్రయోజనం లేని భూమి జాబితాలో కొనసాగకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.క్లారిటీ లేని అంశాలను స్వయంగా నిర్ణయించి ముందుకు పంపకుండా, అవసరమైన సందర్భాల్లో ఉన్నతాధికారుల నుంచి స్పష్టత తీసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి తన పరిధిలోని రికార్డులను పూర్తిగా పరిశీలించి, అవసరమైనప్పుడు పక్కా ఆధారాలతో సమాధానం చెప్పే విధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రయోజనం ఉన్న భూముల పరిరక్షణ, తప్పుగా నమోదైన వివరాల సవరణ, ఖచ్చితమైన రికార్డు నిర్వహణ, రెవెన్యూ , రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయం ద్వారా సెక్షన్ 22-ఏ భూ రికార్డులను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

### రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధన సంస్థలో

# ఘనంగా భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు


జాతీయ వరి పరిశోధన సంస్థ లో మువ్వన్నెల జెండాను ఎగురవేస్తున్న ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాస ప్రసాద్


స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఐ ఐ ఆర్ ఆర్ శాస్త్రవేత్త లు, ఉద్యోగులు


ఐ ఐ ఆర్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాస ప్రసాద్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న ఫోటో గ్రాఫర్ ఎం నాగ భూషణం

**బుద్వేల్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐ ఐ ఆర్ ఆర్) లో శనివారం భారత 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సంస్థ డైరెక్టర్ ఎం శ్రీనివాస్ ప్రసాద్ నేతృత్వంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఎం శ్రీనివాస ప్రసాద్ మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ హరి ప్రసాద్, డాక్టర్ ప్రసాద్ బాబు, డాక్టర్ నీరజ, డాక్టర్ అంతుల్ వారిస్, డాక్టర్ పద్మ కుమారి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జ్యోతి బద్రి, డాక్టర్ కృష్ణవేణి, ఐ ఐ ఆర్ ఆర్ పరిపాలనాధికారి శీతాంశు తో పాటు టెక్నికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు.

# వాజ్‌పేయి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

### వాజ్‌పేయి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి

### భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘన నివాళు లర్పించిన బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్

**కూకట్ పల్లి, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

భారత రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంచి మహేందర్ మాట్లాడుతూ.. దేశ సేవనే జీవిత ధ్యేయంగా భావించి, భారతదేశ అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయి అని కొనియాడారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేసిన అరుదైన రాజకీయ నాయకుడు వాజ్‌పేయి అని అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధి, జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వాజ్‌పేయి ప్రసంగాలు, దేశభక్తి, స్ఫూర్తి, ఆదర్శాలు నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. "వాజ్‌పేయి ఆశయాలను ఆచరణలో పెట్టి, ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి" అని కాంచి మహేందర్ పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

### 22 ఏ నిషేధిత భూములపై

# అపోహాలు వద్దు

### అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

**రాజేంద్రనగర్,ఆగస్టు16(ప్రభాత ఉదయం)**

22ఏ నిషేధిత భూములపై యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రికార్డులను పరిశీలించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 22 ఏ నిషేధిత భూముల జాబితాను పరిశీలిస్తున్నట్లు రాజేంద్రనగర్ మండల తాసిల్దార్ కార్యాలయం చేరుకొని తాసిల్దార్ రాముడుతో కలిసి అదనపు జిల్లా కలెక్టర్ చంద్రారెడ్డి భూ రికార్డులను పరిశీలించారు.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 22 ఏ నిషేధిత భూములను పరిశీలించాలని ఆదేశించింది.ఇందులో భాగంగా రెవిన్యూ అధికారులు తమ తమ పరిధిలోని 22 ఏ భూముల జాబితాను రికార్డుల పరంగా మరోసారి పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ అధికారులను రికార్డులను పునః పరిశీలించాలని ఆదేశించటంతో రికార్డులను పరిశీలిస్తున్నామన్నామని తెలిపారు. ఆదివారం కూడ ఈ అంశంపై రికార్డులను పరిశీలిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పరిశీలనలో డిప్యూటీ తాసిల్దార్ నవత తదితరులున్నారు.


రాజేంద్రనగర్ తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి


తపస్ (TPUS) జిల్లా అధ్యక్షులు కోట్ల కాశీరావు


PRTU జిల్లా అధ్యక్షులు ఎ. మహేందర్ రెడ్డి

## జీవో 25 ప్రకారమే మిగులు ఉపాధ్యాయుల కేటాయింపు చేయాలి..

**రాజేంద్రనగర్,ఆగస్టు16(ప్రభాత ఉదయం)**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవో నంబర్ 25ను అనుసరించి మండల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మిగులు ఉపాధ్యాయుల వివరాలను సేకరించారని టీపీయూఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు,ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్,పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.మహేందర్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి తెలిపారు.మండల విద్యాధికారులు గుర్తించిన మిగులు ఉపాధ్యాయులను జీవో నంబర్ 25 ప్రకారం ఉపాధ్యాయుల అవసరం ఉన్న పాఠశాలలకు కేటాయిస్తూ గౌరవ కలెక్టర్ అనుమతితో జిల్లా విద్యాధికారి ఆదేశాలు జారీ చేశారని వారు వివరించారు.జిల్లా విద్యాధికారి స్వతంత్రంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.పాఠశాలల నుంచి మిగులు ఉపాధ్యాయులను గుర్తించే సమయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి,సీనియారిటీ ఆధారంగా మిగులు ఉపాధ్యాయుల వివరాలను సేకరించినట్లు తెలిపారు.ఈ ప్రక్రియలో జిల్లా విద్యాధికారి స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం లేదని పేర్కొన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మొత్తం ప్రక్రియ కొనసాగిందని స్పష్టం చేశారు.అయితే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే జిల్లా విద్యాధికారి ఇష్టానుసారంగా వ్యవహరించారని గట్టిగా మందలించడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు.జిల్లా విద్యాధికారి ప్రభుత్వ ఆదేశాలు,జీవో నంబర్ 25 నిబంధనలకు అనుగుణంగానే విధులు నిర్వహించారని తెలిపారు.వాస్తవాలను పూర్తిగా పరిశీలించకుండా జిల్లా విద్యాధికారిపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని పేర్కొంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలను టీపీయూఎస్,పీఆర్టీయూ నాయకులు తీవ్రంగా ఖండించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిగిన ఉపాధ్యాయుల కేటాయింపు ప్రక్రియను తప్పుగా చిత్రీకరించవద్దని వారు కోరారు.


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు, నకిలీ పంచలోహ విగ్రహం

## నకిలీ పంచలోహా లక్ష్మీదేవీ విగ్రహం, ఆరుదైన రాయి పేరిట మోసం, ఆరుగురిని అరెస్ట్ చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు

**బుద్వేల్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

నకిలీ పంచలోహ లక్ష్మీదేవీ విగ్రహం, మహిమలు ఉన్నాయంటు ఒక రాయి ని అధిక ధరలకు విక్రయించి అమాయకులను మోసం చేసేందుకు ప్రయత్నించిన ఆరుగురు ముఠా సభ్యులను జూబ్లీహిల్స్ టాస్కోర్స్ పోలీసులు, మైలార్దేవుపల్లి పోలీసులు సంయుక్తం గా దాడి చేసి శనివారం అరెస్ట్ చేశారు. ఈ కేసు కు సంబందించిన వివరాలను హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్కఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గాయక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం వెల్లడిం చారు. శనివారం కాటేదాన్ లోని లక్ష్మీగూడ లో నిందితులు కొనుగోలు దారుల కోసం వేచి చూస్తున్నారనే సమాచారం రావడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు, మైలార్దేవుపల్లి పోలీసులు దాడులు చేసి వారిని అరెస్ట్ చేశారు. మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట్ కు చెందిన కేతావత్ రాజు అలియాస్ కట్టప్ప, మైలార్దేవుపల్లి కి చెందిన పి నర్సింహ్మా, పడత్య కుమార్, ప్రవీణ్ సింగ్, మంగలి బసవ నరేశ్, వేమ ల వాడ కు చెందిన సిద్ధాంతి చల్లా రవి ఒక ముఠా గా ఏర్పడ్డారు. 2024లో వి నర్సింహ్మా అనే వ్యక్తి వేములవాడకు చెందిన చల్లా రవి, కొండపల్లి భిక్షపతి వద్ద నుంచి నకిలీ పంచలోహ లక్ష్మీదేవీ విగ్రహాన్ని రూ.10లక్షలకు కొనుగోలు చేసి మోసపోయాడు ఆ తర్వాత ఆ విగ్రహాన్ని పడత్య కుమార్ కు అందజేశాడు. దాంతో వారంతా ఒక గ్రూపుగా ఏర్పడి, ఆ నకిలీ విగ్రహానికి దివ్య శక్తులు ఉన్నాయని, అదృష్టాన్ని తీసుకోస్తుందని నమ్మబలికి అమాయకులను భారీ ధరలకు విక్రయించాలని ప్లాన్ చేశారు. అదే సమయంలో కేతావత్ రాజు తన వద్ద ఒక అరుదైన గులాబీ రంగు రాయి ఉందని, దాన్ని కూడా అధిక ధరకు విక్రయించవచ్చని బావించి ముఠా లో చేరాడు. శనివారం కాటేదాన్ లక్ష్మీగూడ సమీపంలో ఈ నకిలీ విగ్రహం, రాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా టాస్కోర్స్ పోలీసులు, మైలార్దేవుపల్లి పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో నవాబ్పేట్ మండలం, చౌదుర్ గ్రామానికి చెందిన కారు డ్రైవర్ కేతావత్ రాజు అలియాస్ కట్టప్ప (38), కాటేదాన్ లక్ష్మీగూడ కు చెందిన డ్రైవర్ పడత్య కుమార్ (34), కాటేదాన్ మధుబన్ కాలనీ కి చెందిన డ్రైవర్ ప్రవీణ్ సింగ్ (34), అదే ప్రాంతానికి చెందిన మంగలి బసవ నరేశ్ (38), రంగారెడ్డి జిల్లా మంచాల్ లోయపల్లి కి చెందిన పి నర్సింహ్మా ( 45), రాజన్న సిరిసిల్ల జిల్లా వేముల వాడ చీర్లవంచ గ్రామానికి చెందిన జోతిష్యుడు చాలా రవి (38), ని అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక నకిలీ పంచలోహ లక్ష్మీ దేవీ విగ్రహం, ఒక గులాబీ రంగు రాయి, ఎర్టీగా కారు (టీఎస్ 04 బి 0549), ఐదు మొబైల్ ఫోన్లు, మూడు రసాయన ద్రావణాల బాటిళ్లు, రెండు ఎరుపు రంగు తువాళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చేదించడంలో జూబ్లీహిల్స్ టాస్కోర్స్ ఇన్స్పెక్టర్ ఛత్రి యాదేందర్, సబ్ ఇన్స్పెక్టర్ జి సందీప్ రెడ్డి బృందం, మైలార్దేవుపల్లి పోలీసులు చురుకుగా పాల్గొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసు ను మైలార్ దేవుపల్లి పోలీసులకు అప్పగించారు.

## రాజేంద్రనగర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులుగా ఎం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పి ఈశ్వర్‌లు ఎంపిక

**బుద్వేల్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులుగా ఎం శ్రీనివాస్ నియమితులైనారు. శనివారం సాయంత్రం రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆవరణ లో వినాయక ఉత్సవ కమిటీ ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎస్ గంగాధర్, యశ్వంత్ (నాని), ప్రధాన కార్యదర్శిగా పి ఈశ్వర్, సంయుక్త కార్యదర్శిగా ఎం శ్రీకాంత్, సాంస్కృతిక కార్యదర్శులుగా ఈ శ్రీకాంత్, బి రాజేందర్, జి రాకేశ్, డి నర్సింహ్మారాజు, కోశాధికారిగా జె రవీందర్, ఉప కోశాధికారిగా ఎస్ సత్య ప్రకాశ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గుండాల శ్రీనివాస్, బి నర్సింహ్మారాజు, ఎం. కార్తీక్, బంటీ, శ్రీనాథ్, పుష్పరాజ్, భజన ఇంచార్జిలుగా ఎం నాగభూషణం, ఎం రాంబాబు యాదవ్, ఎస్ నర్సింహ్మా, సలహాదారులుగా ఎస్ జగదీశ్వర్, బి పద్మారావు, ఎ భీమయ్య, ఎస్ అమరేందర్, వై.శ్రీధర్ నియమితులైనారు.



## జిల్లా వ్యవసాయ శాఖకు ఉత్తమ పురస్కారం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ పని తీరుకు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం లభించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన వేడుకల్లో జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ తరపున తాను రాష్ట్రస్థాయి ఉత్తమ పనితీరు అవార్డును రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు గోపి చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. జిల్లాలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో అధికారులు, సిబ్బంది చేసిన కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచిందన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల కృషి వలన ఈ గుర్తింపు సాధ్యమైందని తెలిపారు. ఇకముందు కూడా తమ అధికారులు, సిబ్బంది రెట్టింపైన ఉత్సాహంతో, బాధ్యతతో పని చేసి రైతుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# అత్తాపూర్ నుంచి చిన్న అనంతగిరి శివాలయానికి శోభాయమానంగా కవాడి యాత్ర

**రాజేంద్రనగర్,ఆగస్టు16 (ప్రభాత ఉదయం)**







రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ నుంచి రాంబాగ్ ప్రాంతానికి చెందిన భక్తులు శ్రావణమాసం సందర్భంగా కవాడి యాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ యాత్రలో దాదాపు 200 మంది భక్తులు పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో ఉత్సాహంగా యాత్రను కొనసాగించారు.అత్తాపూర్ నుంచి చిన్న అనంతగిరి శివాలయం వరకు కవాడులతో పాటు అభిషేక జలాలను తీసుకెళ్లి శివునికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు,మూగజీవులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వర్షాలు పడాలని శివుడిని ప్రార్థించినట్లు చెప్పారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ కవాడి యాత్రను ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.



## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ

**బండ మైసమ్మ అమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బండి రమేష్**

**కూకట్ పల్లి, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లో నిర్వహించిన శ్రీ బండ మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, బండ మైసమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మూసాపేట్ డివిజన్ ప్రెసిడెంట్ తూము సంతోష్, తోట రాజు, పల్లపు సత్యనారాయణ, పల్లపు రాజు, సంపంగి సంపంగి, మొక్కల రాజేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## మంచి వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలి

**సుమని క్లినిక్ ను ఏర్పాటు చేయడం అభినందనీయం**

**పేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి**

**పిఏసీ చెర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**

**కూకట్ పల్లి, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్, హనుమాన్ నగర్ లో నూతన సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ను మాజీ కార్పొరేట్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు చంద్రకాంత్ రావు, జిల్లా గణేష్ తోపాటు కలిసి స్థానిక ఎమ్మెల్యే పిఏసీ చెర్మెన్ అరేకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ సుమని క్లినిక్ యజమాని డాక్టర్ సుకన్య ను అభినదించారు. అలాగే ఇక్కడ నివసించే కుటుంబాలు పేద మధ్యతరగతి వారు ఎక్కువగా ఉంటారని, వారికి నాణ్యమైన వైద్యం అందించాలని చెప్పారు. ఇక్కడ జనరల్ పిజిషన్, స్పీచ్ తెరాపి, పిజియో తెరాపి వైద్యులు అందుబాటులో ఉండడం విశేషం, మంచి వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీ పెద్దలు, వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుంది

**పార్కు స్థలాలను అమ్మి భవిష్యత్తును అంధకారం చేస్తుంది**

**కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి... బిఆర్ఎస్ నేత అశ్వంత్ కుమార్**

**కూకట్ పల్లి, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**



ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ నేడు ప్రజా వ్యతిరేక పాలన చేస్తుందని బిఆర్ఎస్ నేత అశ్వంత్ దుయ్యబట్టారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలకు లక్ష రూపాయలకు తోడు తులం బంగారం ఇస్తానన్న రేవంత్ రెడ్డి సర్కారు నేడు ఆ లక్ష రూపాయలకు కూడా దిక్కు లేకుండా చేసిందని.. నిరుపేదల ఆడబిడ్డలకు ఉపయోగపడుతుందని ఆనాడు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభిస్తే దానికి చట్టపద్ధత లేదు అంటూ దాన్ని కూడా ఆపడం ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అని అన్నారు. ఉన్న స్థలాలను అమ్మేసి డబ్బులు చేసుకుని కనీసం చిన్నపిల్లలుకు ఉపయోగపడే పార్కు స్థలాలును కూడా అమ్మి వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాతిపెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. 420 అబద్ధపు హామీలను చెప్పి అధికారంలోకి వచ్చి నేడు అన్ని రంగాలను భ్రష్టు పట్టించిన ఈ ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెబుతావని ప్రజలు కూడా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి వైఫల్యాన్ని ఎండగట్టే బాధ్యత తీసుకుంటామని మా నాయకుడు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనలతో ముందుకు వెళ్తామని సందర్భంగా అశ్వంత్ తెలియజేశారు.

## సోమవారం 17 నుంచి మండల స్థాయిలోనూ ప్రజావాణి

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16(ప్రభాత ఉదయం)**



ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలోనే కాకుండా ఈనెల 17వ తేదీ నుంచి మండల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా సంబంధిత మండలాల అన్ని శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటా రన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించే మండల స్థాయి ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సమర్పించవచ్చున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులను సంబంధిత అధికారులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరిస్తారన్నారు. ప్రజలు చిన్న చిన్న సమస్యలకే కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం లేకుండా ఆయా మండలాల్లోనే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల సంబంధిత మండలాధికారులు మండల స్థాయి ప్రజావాణికి సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



## సెల్ఫీల మోజులో పర్యాటకులు

**నదీ అంచుకు వెళ్లి పర్యాటకుల సందడి**

**సెల్ఫీల మోజులో పడుతూ ప్రమాదానికి గురవుతున్న పర్యాటకులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు16(ప్రభాత ఉదయం)**

ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు వరద వస్తుండటంతో ప్రాజెక్టు పూర్తిగా నిండి జలకళను సంతరించుకుంది. దీంతో ప్రా జెక్టు అందాలను తిలకించడానికి పర్యాటకులు పోటెత్తారు. కానీ, వచ్చిన పర్యాటకులు ప్రాజెక్టు వెనుకబాగాన నదిలోకి దిగి ఫొటోలు దిగుతూ ప్రమాదపు అంచు వరకు వెళ్లి వస్తున్నారు. అయితే, అక్కడ అనుకోని సంఘటన జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కృష్ణానదీ అందాలను తిలకించడానికి పర్యాటకులు తమ కుటుంబసభ్యులతో వచ్చి ప్రాజెక్టులోకి దిగి సెల్ఫీలు దిగుతున్నారు. అంతేకాకుండా నదిలో మొసళ్లు ఉన్న ఉన్నాయని పోలీస్ శాఖ పర్యాటకులను హెచ్చరించినా పర్యాటకులు పట్టించుకోకుండా నదిలోకి దిగి సందడి చేస్తున్నారు. ప్రమాదం అంచు వరకు వెళ్లి ఫొటోలు దిగుతుండడంతో ఏ నిమిషానికి ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. పర్యాటకులు కుటుంబ సభ్యులతో వచ్చి ప్రాజెక్టు అందాలను చూస్తూ.. కుటుంబ సభ్యులతో ఆడుతూ పాడుతూ సరదగా గడిపితే సంతోషమే కానీ, నదిలోకి దిగి ఫొటోలు దిగడం ఆందోళనకు గురిచేస్తోంది. పర్యాటకులను నదిలోకి దిగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పలువురు చూసిస్తున్నారు.



## కోతకు గురవుతున్న జూరాల కుడికాలువ

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు16(ప్రభాత ఉదయం)**

పీజేపీ అధికారుల నిర్వహణ లోపం, నిధుల కొరత కారణంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మీధ ఆధాపడిన కుడి, ఎడమ కాలువలు ధ్వంసం కావడంతో మరమ్మతులు నోచుకోలేదు. గత కొన్నేళ్లుగా మరమ్మతులు చేపడతామని ఏటా నీటిపారుదలశాఖ సిబ్బంది చెబుతున్న మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి. వాన కాలం ప్రారంభమవడంతో నీటి ప్రవాహనికి కొన్ని చోట్ల కాలువలకు గండి పడే అవకాశం వాటిలింది. తాజాగ జూరాల ప్రాజెక్టు నుంచి సాగు, త్రాగు నీటి అవసరల కొరుకు కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. జూరాల కుడి కాలువకు విడుదలైన నీటి ప్రవాహానికి కొద్దికొద్దిగా కోతకు గురవుతోందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. పీజేపీ అధికారులు లైనింగ్ పనులకు వెంటనే నిధులు విడుదల చేసి, కాలువ గట్లను శాశ్వతంగా బలపరచాలని డిమాండ్ చేశారు.



## 22ఏ నిషేధిత భూముల రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించండి

**రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి**

**గండిపేట తహసీల్దార్ కార్యాలయంలో 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితాపై అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి సమీక్ష**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 ( ప్రభాత ఉదయం)**

పత్రాలు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా నిషేధిత ఆస్తుల జాబితా రూపొందించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం జిల్లాలోని 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితా పరిశీలనలో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి గండిపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి 22-ఏ జాబితాను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారీగా ఉన్న 22-ఏ నిషేధిత ఆస్తుల వివరాలను పరిశీలించి, సంబంధిత రికార్డులు, దస్తావేజులు , ఇతర ఆధారాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జాబితాలోని ప్రతి ఆస్తికి సంబంధించిన వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరిశీలన చేపట్టాలని అధికారులకు సూచించారు. 22-ఏ జాబితాలో చేర్చాల్సిన లేదా కొనసాగించాల్సిన ఆస్తుల విషయంలో కేవలం రికార్డుల ఆధారంగానే కాకుండా అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయి పరిశీలన కూడ నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత భూముల వాస్తవ పరిస్థితి, రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ దస్తావేజులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం మాత్రమే తుది జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల వారీగా నిషేధిత ఆస్తుల జాబితాను సిద్ధం చేసి, ప్రతి ఆస్తికి సంబంధించిన పత్రాలను సక్రమంగా పరిశీలించి, పూర్తి వివరాలతో నివేదికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములు మరియు 22-ఏ పరిధిలోకి వచ్చే ఇతర ఆస్తుల విషయంలో నిబంధనల ప్రకారం ప్రత్యేక శ్రద్ధతో పరిశీలన జరపాలని తెలిపారు. 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితా విషయంలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అర్హత కలిగిన ఆస్తులు అనవసరంగా జాబితాలో చేరకుండా, నిబంధనల ప్రకారం నిషేధిత పరిధిలోకి వచ్చే ఆస్తులు జాబితాలో ఉండేలా పకడ్బందీగా పరిశీలన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.



స్త్రీ శక్తీ సనాతన శక్తి కార్యక్రమం సందర్బంగా పూజలు చేస్తున్న గవర్నర్ ఆలయ కమిటీ సభ్యులు..

## సనాతన ధర్మంలో మహిళలకు అత్యున్నత స్థానం

**తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల**


**విశాఖ శ్రీ శారదా పీఠం ఆధ్వర్యంలో 'స్త్రీ శక్తి సనాతన శక్తి' కార్యక్రమం**

**శేరిలింగంపల్లి : ఆగష్టు 16, (ప్రభాత ఉదయం)**

సనాతన ధర్మంలో మహిళలకు అత్యున్నత, అద్భుతమైన స్థానం ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అభిప్రాయపడ్డారు. మన చరిత్ర, సంస్కృతుల్లో దీనికి అనేక నిదర్శనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. చందానగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశాఖ శ్రీ శారదా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్త్రీ శక్తి సనాతన శక్తి' కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ రాజశ్యామలాదేవి దర్బారు సేవలో పాల్గొనగా, పీఠం తరఫున నిర్వాహకులు ఆయనకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. మహిళల్లో దాగి ఉన్న అపారమైన శక్తిని వెలికితీసి వారిని చైతన్యపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ విజయలక్ష్మి, రమా విశ్వనాథన్, వాణి సక్కుబాయి, వారణాసి రాధిక, పల్లా రాధిక, మౌనిక సుంకర తదితరులు ప్రసంగిస్తూ మహిళ సాధికారత, సామాజిక ప్రాధాన్యతపై విశేషంగా ప్రసంగించారు. నదులను, దేశాన్ని స్త్రీ మూర్తులుగా పూజించే సంస్కృతి మనదని విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ, మహిళలకు అత్యున్నత గౌరవమిచ్చిన దేశాల్లో భారతదేశం అగ్రస్థానంలో ఉంటుందని స్పష్టం చేశారు. "మన దేశంలో నదులకు, పర్వతాలకు సైతం మహిళల పేర్లు పెట్టి పూజించే దివ్యమైన సంస్కృతి ఉంది. చివరికి మన జన్మభూమిని కూడా 'భారతమాత' అని స్త్రీ మూర్తిగా ఆరాధిస్తున్నాం" అని గుర్తుచేశారు. పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో మహిళల అభ్యున్నతికి విశేష ప్రాధాన్యం ఉందన్నారు. విశాఖ శారదా పీఠం వివిధ రంగాల్లో మహిళలను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఆలయ కమిటీ, అర్చకులు, శ్రేయోభిలాషుల సమన్వయంతో విజయవంతంగా జరిగిన ఈ వేడుకలో నాట్య వేద కళాక్షేత్రం చిన్నారుల నృత్య ప్రదర్శన, వారణాసి శ్రీకృష్ణ రాఘవ సంగీత కచేరీ భక్తులను, ఆహూతులను విశేషంగా అలరించాయి.






## ఉత్తమ సేవలకు ప్రశంసలు అందుకున్న వివిధ శాఖల అధికారులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

ఉత్తమ సేవలు అందిస్తూ ముందుకు సాగుతున్న పలువురు అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా ఫరేడ్ గ్రౌండ్ లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ చేతుల మీదుగా ఉత్తమసేవా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో కేటిదొడ్డి తహసీల్దార్ కరుణకర్, ఎంపీడిఓ రమణ రావు, కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు, నందిన్నె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చందన, కుచినెర్ల ఏఇఓ కిరణ్ కుమార్ రెడ్డి, కొండాపురం గ్రామ సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు, రాష్ట్ర గొర్రెలు మరియు బర్రెల అభివృద్ధి సహాకార సమాఖ్య చైర్ పర్సన్ సరిత, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మీ, జిల్లా అదనపు కలెక్టర్ లు, ఉద్యోగులు, వారిని అభినందించారు.

# సోషల్ మీడియానే మన ఆయుధం..
# ప్రతి పోస్ట్ బీసీల్లో చైతన్యం నింపాలి






**పార్టీకి ఇంధనం సోషల్ మీడియా విభాగమే**

**మిమ్మల్ని ఇబ్బంది పెడితే గంటలో అక్కడుంటా**

**బలమైన లీగల్ సెల్ మన వెంటుంది**

**మండల స్థాయి సోషల్ మీడియా టీం బలోపేతం చేయాలి**

**బిసోషల్ మీడియా విభాగంతో పార్టీ చీఫ్ తీన్మార్ మల్లన్న**

**హైదరాబాద్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) విస్తరణలో సోషల్ మీడియా విభాగం కీలక పాత్ర పోషించాలని పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఆకుల మనోజ్ ఆధ్వర్యంలో పార్టీ సోషల్ మీడియా వారియర్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ భవిష్యత్ కార్యాచరణపై మల్లన్న దిశానిర్దేశం చేశారు.

"సోషల్ మీడియానే మన ఆయుధం.. ప్రతి పోస్ట్ బీసీల్లో చైతన్యం నింపాలి" అని మల్లన్న స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, బీసీల రాజ్యాధికార లక్ష్యం, ప్రజా సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సోషల్ మీడియా వారియర్స్‌పై ఉందన్నారు. సోషల్ మీడియా విభాగం పార్టీకి ఇంధనం లాంటిదని, ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేస్తే పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.

**మండల స్థాయి సోషల్ మీడియా బలోపేతమే లక్ష్యం**

ప్రతి మండలంలో సోషల్ మీడియా బృందాలను ఏర్పాటు చేసి, గ్రామస్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను విస్తరించాలని మల్లన్న సూచించారు. కేవలం పోస్టులు చేయడం కాకుండా ప్రజల సమస్యలను గుర్తించి, వాటిపై అవగాహన కల్పించేలా సోషల్ మీడియాను వేదికగా ఉపయోగించుకోవాలని అన్నారు.

"ప్రతి పోస్ట్ ఒక ఉద్యమానికి బీజం కావాలి.. ప్రతి వీడియో బీసీల్లో చైతన్యాన్ని రగిలించాలి" అని పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు సూచించారు.

**ఇబ్బంది వస్తే గంటల్లో అక్కడుంటా**

సోషల్ మీడియా వారియర్స్‌కు పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని మల్లన్న భరోసా ఇచ్చారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఆకుల మనోజ్ అన్ని వేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని, ఎలాంటి సలహాలు, సూచనలు లేదా సమస్యలు ఎదురైనా ముందుగా ఆయనను సంప్రదించాలని సూచించారు. "మిమ్మల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే గంటల్లో అక్కడుంటానని, మన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని,అవసరమైతే నేరుగా నాకే ఫోన్ చేయండి" అని మల్లన్న స్పష్టం చేశారు.సోషల్ మీడియా కార్యకర్తలపై ఎలాంటి తప్పుడు కేసులు, బెదిరింపులు, వేధింపులు జరిగినా పార్టీ వారికి అండగా నిలుస్తుందని తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. సోషల్ మీడియా విభాగానికి అనుసంధానంగా బలమైన లీగల్ సెల్‌ను ఏర్పాటు చేశామని, ప్రతి కార్యకర్తకు న్యాయపరమైన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.చట్టపరమైన ఇబ్బందులు వస్తే లీగల్ సెల్ అండగా ఉంటుందని,అవసరమైతే నేనే స్వయంగా రంగంలోకి దిగుతా" అని మల్లన్న భరోసా ఇచ్చారు.

**సెప్టెంబర్ 17 నుంచి పాదయాత్ర**

బీసీల రాజ్యాధికారం, సామాజిక న్యాయం లక్ష్యంగా సెప్టెంబర్ 17వ తేదీ నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు మల్లన్న ఈ సందర్భంగా వెల్లడించారు. పాదయాత్రతో పాటు పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఆకుల మనోజ్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ఇచ్చిన దిశానిర్దేశంతో మండల, నియోజకవర్గ స్థాయిల్లో సోషల్ మీడియా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. ప్రతి సోషల్ మీడియా వారియర్ పార్టీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా సౌత్ కన్వీనర్ మార్తా శ్రీనివాస్,ఉమ్మడి జిల్లాల కన్వీనర్లు హర్ష,శ్రీకాంత్,సత్యనారాయణరాజు, సాయి చరణ్ పటేల్,నాంపల్లి జగన్,లతీఫ్ తో పాటు జిల్లా కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు



## వాజ్‌పేయి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

**వాజ్‌పేయి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి**

**భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘన నివాళులర్పించిన బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్**

**కూకట్ పల్లి, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

భారత రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంచి మహేందర్ మాట్లాడుతూ.. దేశ సేవనే జీవిత ధ్యేయంగా భావించి, భారతదేశ అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయి అని కొనియాడారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేసిన అరుదైన రాజకీయ నాయకుడు వాజ్‌పేయి అని అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధి, జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వాజ్‌పేయి ప్రసంగాలు, దేశభక్తి, స్ఫూర్తి, ఆదర్శాలు నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు."వాజ్‌పేయి ఆశయాలను ఆచరణలో పెట్టి, ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి" అని కాంచి మహేందర్ పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.



## ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం పడాల్సిందే..

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16(ప్రభాత ఉదయం)**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సోనియా గాంధీ,మల్లి కార్జున్ ఖర్గే , రాహుల్ గాంధీ వందేమాతరం గీతాన్ని పూర్తిగా ఆలపించకుండా అవమానించారంటూ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వైఎస్సార్ చౌక్ వద్ద జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ..జాతీయ గేయాన్ని అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమేనని, ఈ ఘటనపై కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర నాయకులు దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు.లిఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే,శ్యామ్ రావ్, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహ , బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అనిల్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, కౌన్సిలర్ చంద్ర శేఖర్ ,మాజీ కౌన్సిలర్ శ్రీమన్నారాయణ,బీజేపీ సినీయర్ నాయకులు అక్బర్ బాషా, సద్దల క్రిష్ణ,మధు గౌడ్,శంకర్, డిల్లీ వాలా క్రిష్ణ,తిమ్మన, బిజెవైఎం నాయకులు పాండు, సతీష్, మోహన్ రెడ్డి, పవన్ ,రమేష్,కిషోర్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.






కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జహంగీర్ (ఫైల్ ఫోటో)

## గుండె పోటుతో 108 అంబులెన్స్ టెక్నీషియన్ మృతి

**ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం అందుకున్న టెక్నీషియన్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జిల్లా ఫరేడ్ గ్రౌండ్ లో ఉత్తమ సేవలందించి అందరి మన్ననలు పొంది జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశాంసా పత్రం అందుకున్న 108 అంబులెన్స్ ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియిన్ జహంగీర్ బాష(29) ఆదివారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందాడు. గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ బాష 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి) గా విధులు నిర్వహిస్తు గద్వాల పట్టణంలోని బీడీ కాలనీలో నివసిస్తున్నాడు. ఉత్తమ సేవలకుగాను జహంగీర్ బాషా శనివారం జిల్లా కలెక్టర్ మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నాడు. ఆదివారం వేకువ జామున గద్వాలలో ఇంట్లో నిద్రిస్తున్న జహంగీర్ కు అకస్మాతుగా గుండెపోటు రాగ కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గత అయిదు సంవత్సరాలుగా 108 విభాగంలో ఎమెర్జీన్సీ మెడికల్ టెక్నీషియన్ గా విదులు నిర్వహిస్తూ నిబద్ధతో అంకితభావంతో అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఉత్తమ ప్రతిభ ప్రశంసా పత్రం అందుకున్న కొన్ని గంటలలోనే గుండెపోటుతో మృతి చెందడం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని 108 సిబ్బంది, కుటుంబ సభ్యులు కోరారు.

### విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి
## పెద్ద ఎత్తున తరలి రండి

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ , ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 18వ తేదీన ట్యాంక్ బండ్ వద్ద నిర్వహిస్తున్నట్టు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వెల్లడించారు. ఆదివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఈ ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 18వ తేదీన పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్,గండిపేట్, రాజేంద్రనగర్ మండలాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో మా జోక్యం పరిమితం : హైకోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 16 (ప్రభాత ఉదయం)**

ఆర్థిక, సంక్షేమ విధానాలకు సంబంధించిన ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రాధాన్యాలను కోర్టులు నిర్ణయించలేవని హైకోర్టు తేల్చి చెప్పింది. ఆర్థిక విధానాల్లో కోర్టుల జోక్యం పరిమితమని, ప్రభుత్వ విధానం ఏకపక్షం, వివక్షాపూరితం, రాజ్యాంగ, చట్టనిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు రుజువైతే తప్ప జోక్యం చేసుకోవాలని స్పష్టం చేసింది. కోవిడ్ 2019 ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతుబంధు పథకం నిధులు విడుదల చేయకపోవడం ప్రభుత్వ విధాన నిర్ణయంలో భాగమేనని పేర్కొంది. బడ్జెట్ కేటాయింపులు లేని మొత్తాన్ని చెల్లించాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేయలేదని పేర్కొంది. 2019 రబీ, ఖరీఫ్ సీజన్‌లో నిలిపివేసిన రైతుబంధు సొమ్ము చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు దాఖలు : కొవిడ్ సమయంలో 2019లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు రైతుబంధు చెల్లించకపోవడాన్ని సవాలు చేస్తూ ఖమ్మం జిల్లా తల్లాడ మండలం తల్లాడ, తెలగారం గ్రామాలకు చెందిన టి.వెంకటనారాయణ మరో నలుగురు రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రైతుబంధు చెల్లించాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. అప్పీలుపై విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యాలపై ప్రభుత్వాలేదే నిర్ణయం : కొవిడ్ సమయంలో తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రభుత్వం సమర్పించిన వివరాల ద్వారా స్పష్టమవుతోందని ధర్మాసనం తెలిపింది. 2019 వానా కాలంలో 1.42 లక్షల మంది రైతులకు రూ.850.82 కోట్లు, యాసంగిలో 9.46 లక్షల మందికి రూ.2132.95 కోట్లు నిధులు విడుదల చేయలేదని స్పష్టం చేసింది.

## విద్యార్థుల భవిష్యత్తుకు పెద్ద ఈరన్న భరోసా.. రూ.50 వేల చేయూత

**విద్యా వాలంటీర్ కోసం ఆర్థిక సాయం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16(ప్రభాత ఉదయం)**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మద్దెలబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి మాజీ వైస్ ఎంపీపీ పెద్ద ఈరన్న రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను ప్రధానోపాధ్యాయుడు గోవిందు, ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు.ఈ సందర్భంగా పెద్ద ఈరన్న మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడం మన సామాజిక బాధ్యత. పేద పిల్లల చదువుకు చేసే ప్రతి సహాయం వారి భవిష్యత్తుకు బలమైన పునాది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పెద్ద ఈరన్న అందించిన సహాయంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608